## చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో.. నేడు కేటీఆర్ రోడ్ షో

- విజయవంతం చేయాలని సబితారెడ్డి పిలుపు
- కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు చీకొడుతున్నరు
- బీఆర్ఎస్‌ను మోసం చేసిన.. రంజిత్ రెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డిలకు బుద్ధి చెప్పాలి
- బీసీలంతా ఏకమై జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- చేవెళ్ల పార్లమెంటులో హ్యాట్రిక్ ఖాయం



బడంగ్‌పేట, మే 5 : చేవెళ్ల పార్లమెంటులో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం ( ఈ నెల 6న) చేవెళ్లలో నిర్వహించనున్న కేటీఆర్ రోడ్ షో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆమె బీఆర్ఎస్ శేణులు, ప్రజా ప్రతినిధులు, సంఘాల నాయకులు, అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ నెల 6న శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్‌లో, ఆర్టీఏ ఆఫీస్ దగ్గర సాయత్రం 5గంటలకు, రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి నగర్ చౌరస్తా వద్ద సాయంత్రం 6గంటలకు , మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గాంధీనగర్ చౌరస్తాలో సాయంత్రం 7గంటలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ రోడ్ షో, కార్నర్ మీటింగ్ ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీ అభ్యర్ధి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ తలపెట్టిన బస్సు యాత్రతో ప్రజల్లో పెను మార్పు వచ్చిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి తిరిగి మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్న వారిని ప్రజలు చీకొడుతున్నారన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎక్కడ బస్సు యాత్ర చేపడితే అక్కడ ప్రజలు కుప్పలు తెప్పలుగా వస్తున్నారన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో కేటీఆర్ రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లకు ప్రజల స్పందన చూసిన కాంగ్రెస్, కాషాయం పారీలకు కండ్లు మండుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని మోసం చేసిన రంజిత్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీసీలంతా ఏకమై కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని చెప్పారు. కేటీఆర్ రోడ్ షో కార్యక్రమానికి 20వేల పైచిలుకు ప్రజలు స్వచ్ఛందంగా రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రోడ్ షో, కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

## నేడు కోవిషీల్డ్ ప్రకంపనలపై అవగాహన సదస్సు

సిటీబ్యూరో, మే 5(నమస్తే తెలంగాణ) : కోవిషీల్డ్‌పై ఆస్ట్రాజెనికా చేసిన వ్యాఖ్యలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా తీవ్ర భయాందోళనలకు కారణమవుతున్న తరుణంలో అవేకెన్ ఇండియా మూమెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. మే 6న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. వైద్య, ఫార్మా నిపుణులు, సామాజిక వేత్తలు, మాజీ పరిశోధకులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. త్రాంబోసిస్, త్రాంబోసైటోపెనియా సిండ్రోమ్‌పై వాస్తవాలపై అవగాహన కల్పించేలా, వ్యాక్సిన్ దుష్ప్రభావాలపై లోతుగా విశ్లేషించడంతోపాటు, పరిష్కార మార్గాలపై ఈ వేదిక ద్వారా చర్చించనున్నట్లుగా అవేకెన్ ఇండియా మూమెంట్ ప్రతినిధులు తెలిపారు.

## 20 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

నేరేడ్‌మెట్, మే 4 : హైదరాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు చాముండేశ్వరినాథ్, ప్రధాన కార్యదర్శి కనూరి వంశీధర్ తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, మెన్, ఉమెన్స్ మరియు మాస్టర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలు హైదరాబాద్ జిల్లాకు సంబంధించిన బ్యాడ్మింటన్ క్రీడాకారులు మాత్రమే అర్హులన్నారు. 16వ తేదీ లోపు https://btronline.in ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

# కాంగ్రెస్, బీజేపీలవి మాయమాటలు, దొంగ హామీలు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు ఏం చేశారు.?
- సికింద్రాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయం
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్
- ఆ పార్టీలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థి పద్మారావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లకు తిలకం దిద్ది మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

బేగంపేట్, మే 5 : కాంగ్రెస్, బీజేపీ నేతల మాయమాటలు, దొంగ హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, సికింద్రాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావుగౌడ్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో వారు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మినిస్టర్ రోడ్డులోని సాయిబాబా ఆలయం నుంచి ప్రచారం ప్రారంభించి కాచ్‌బౌలి, వెంగళ్‌రావునగర్, నల్లగుట్ట సీ లైన్, ఎఫ్ లైన్, గైదిన్‌బాగ్, నల్లగుట్ట మసీదు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో అడుగడుగునా మంగళహారతులు, పూల మాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓట్లేస్తే ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని తెలిపారు. మాయమాటలు, దొంగ హామీల కాంగ్రెస్, బీజేపీను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఓట్లేసి ఎంపీగా గెలిపిస్తే కేంద్ర మంత్రి హోదాను పొందిన కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ నియోజకవర్గం ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. కనీసం సమస్యలు చెప్పుకోవడానికి కూడా అందుబాటులో ఉండే వారు కాదని, అలాంటి వ్యక్తికి మరోసారి ఓటు వేసేందుకు ప్రజలు సుముఖంగా లేరని అన్నారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీల అమలు మరిచిపోయిందని పేర్కొన్నారు. ఐదు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గౌడల అభివృద్ధికి కృషి చేస్తా

- ఒక్కొక్కరు మీతో పాటు మరో వంద మంది చేత ఓటు వేయించండి
- మన ఐక్యతను చాటండి.. అంబర్‌పేట నుంచి భారీ మెజార్టీ ఇవ్వండి
- గౌడ జన జాతరలో బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్



అంబర్‌పేటలో నిర్వహించిన గౌడ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి పద్మారావు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, మే 5 : గౌడ కులస్తులంతా గర్జించాలి.. ఈ నెల 13వ తేదీన జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఉన్న గౌడ కులస్తులు ఒక్కొక్కరు మీతో పాటు మరో వంద మంది చేత ఓటు వేయించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ పిలుపునిచ్చారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని గౌడ సంఘం భవనంలో అంబర్‌పేట నియోజకవర్గం గౌడ జన జాతర(సమ్మేళనం) పంజాల గిరిధర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మారావుగౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గౌడ జాతికి న్యాయం చేసేందుకు తాను ఎక్సైజ్ శాఖ తీసుకొని మంత్రిగా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. గౌడ కులస్తుల్లో ఐక్యత ఎంతో అవసరమని తెలిపారు. అంబర్‌పేటలో గౌడ కుటుంబాలు చాలా ఉన్నాయని, వారంతా ముందుకు వచ్చి లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపిస్తే మీ కుల బిడ్డగా మొత్తం గౌడ జాతికి అండగా ఉంటానని తెలిపారు. గతంలో కూడా చాలాసార్లు మన కులస్తులను ఏకతాటి పైకి తీసుకువచ్చేందుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్క గౌడ కులస్తుడిపై పగతో మొత్తం కల్లు దుకాణాలను మూసివేశారని చెప్పారు. కేసీఆర్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎక్సైజ్ శాఖ మంత్రిగా రాష్ట్రంలో ఉన్న అన్ని కల్లు దుకాణాలను తెరిపించిన ఘనత పద్మారావుకే దక్కుతుందన్నారు. బకాయిలను మాఫీ చేయించాడని, రెంటల్స్ లేకుండా చేశారని.. అటువంటి వ్యక్తిని గెలిపించాలన్నారు. ఎన్నికల ఇన్‌చార్జి దాసోజు శ్రావణ్ మాట్లాడుతూ పద్మారావుకు టికెట్ ఇచ్చినప్పుడే గెలుపు ఖాయమైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బి.పద్మావెంకటరెడ్డి, ఇ.విజయ్‌కుమార్‌గౌడ్, దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి, హైకోర్టు న్యాయవాది గుండ్రాతి శారదాగౌడ్, నాయకులు జె.భాస్కర్‌గౌడ్, ఎ.జీవన్‌గౌడ్, పి.చంద్రశేఖర్‌గౌడ్‌లతో పాటు గౌడ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి..

- అనునిత్యం ప్రజాసేవలో ఉంటాం
- కంటోన్మెంట్‌లో ఎంపీ అభ్యర్థి రాగిడి, ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత



కౌసల్యా ఎస్టేట్ కాలనీ వాసులతో మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

కంటోన్మెంట్, మే 5 : మల్కాజిగిరి పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఒకటో వార్డు పరిధిలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో సంచార్ పురి కాలనీ ఫేజ్ – 1, ఫేజ్ – 2, ఉమానగర్, పబ్లిక్ సెక్టార్, వాయునగర్ కాలనీల వాసులతో సమావేశం నిర్వహించారు. అదేవిధంగా 6వ వార్డు పరిధిలో బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ నేతృత్వంలో కౌసల్య ఎస్టేట్ కాలనీ, ఐదో వార్డు పరిధిలోని న్యూవాసవి కాలనీలోని తేలకుంట్ల కృష్ణ నేతృత్వంలో ప్రెసిడెంట్లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదం కోసం వచ్చామని, ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. తమను గెలిపిస్తే అనునిత్యం ప్రజాసేవలో ఉంటామని తెలిపారు.

# ఇది సిగ్గులేని ప్రభుత్వం

- ఆరు గ్యారెంటీల అమలులో విఫలం

- క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- యాచారంలో బీఆర్ఎస్ రోడ్‌షోకు విశేష స్పందన



యాచారం రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం, మే 5 : వంద రోజుల్లోనే హామీలను అమలు చేస్తామన్న రేవంత్‌రెడ్డిది సిగ్గులేని ప్రభుత్వమని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో ఆదివారం భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించగా, ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్పా సీఎం రేవంత్‌రెడ్డి ఒరుగబెట్టిందేమిలేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో రైతుభరోసా డబ్బులు లేవు, రుణమాఫీ లేదు, కల్యాణలక్ష్మి తులం బంగారం లేదు, పింఛన్లు తదితర వాటినన్నింటినీ గాలికొదిలేశారని మండిపడ్డారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే దేశం మొత్తం బడాబాబుల చేతుల్లో ఉంటుందన్నారు. మతోన్మాదం, అరాచకాలు పెరిగి సామాన్యుల బతుకు భారమవుందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జనగాం మాజీ ఎమ్మెల్యే, ఎన్నికల ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో తెలియదన్నారు. తాటాకు చప్పుళ్లకు భయపడేదిలేదు.. బిడ్డా రేవంత్‌రెడ్డి ఒళ్లు దగ్గర పెట్టుకో... అని హెచ్చరించారు. కొంత మంది పార్టీని వీడినంత మాత్రనా బీఆర్ఎస్‌కు నష్టంలేదన్నారు. దొంగలకు బీఆర్ఎస్‌లో చోటులేదని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ భువనగిరి ఎంపీగా తనను గెలిపిస్తే కాంగ్రెస్ మెడలు వంచి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు నల్లగొండ ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, జడ్పీటీసీ జంగమ్మ, మండల అధ్యక్షుడుడ రమేష్‌గౌడ్, ప్రధానకార్యదర్శి భాష, పీఏసీఎస్ చైర్మెన్‌రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

### మంచాల చౌరస్తాలో రోడ్‌షో..



మంచాల, మే 5 : అబద్ధాల కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని, బడుగు బలహీన వర్గాలకు చెందిన క్యామ మల్లేశ్‌ను భువనగిరి ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం రాత్రి మంచాల గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీలంటూ గారడీ మాటలతో గద్దెనెక్కిందన్నారు. ఐదు నెలలు దాటినా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంటు అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ తెలంగాణ వాణి పార్లమెంట్‌లో వినిపించాలంటే బీసీ బిడ్డనైన తనను గెలిపించాలని కోరారు. అబద్ధాలతో ప్రజలను మోసం చేయడానికి వస్తున్న కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి, ఎంపీపీ నర్మద, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చీరాల రమేశ్, బహదూర్, నాయకులు పుల్లారెడ్డి, జంబుల కిషన్‌రెడ్డి, మొగిలి వెంకటేశ్, మొగిలి పావని, జగన్ రెడ్డి, రావు శంకర్, సుకన్య, చిందం రఘుపతి, కందాల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.




కుత్బుల్లాపూర్‌లో శనివారం జరిగిన కేటీఆర్ రోడ్ షోకు భారీగా హాజరైన జనం..

# మల్కాజిగిరిలో కారు దూకుడు

## కేటీఆర్ రోడ్ షోలతో.. పెరిగిన గ్రాఫ్

- బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం
- ఏడు నియోజకవర్గాల్లో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు
- ఎంపీ అభ్యర్థి రాగిడి స్థానికుడు కావడంతో.. సానుకూలంగా ఉన్న ప్రజలు
- లక్ష్మా రెడ్డి గెలుపు నల్లేరుపై నడకే అంటున్న జనం



మేడ్చల్, మే 5 (నమస్తే తెలంగాణ) :

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో కేటీఆర్ సమావేశాలు, రోడ్‌షోలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. దీంతో మల్కాజిగిరి లోక్ సభలో గూలాబీ జెండా ఎగురుతుందన్న ధీమాతో బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాలలో ఉన్న ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తరపున విస్తృత ప్రచారం చేసి ప్రజల మద్దతును కూడగడుతున్నారు. ప్రజల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థికి విశేష స్పందన లభిస్తున్న క్రమంలో మరింత ఉత్సాహంగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రమంతటా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు చేస్తున్న ప్రచారంతో బీఆర్ఎస్ పార్టీ గ్రాఫ్ పెరుగుతూ వస్తుంది. దీనికితోడు మల్కాజిగిరి లోక్ సభ బరిలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఇరువురు స్థానికేతరులు కాగా.. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి స్థానికుడు కావడంతో అనుకూలంగా మారిందని ప్రజల నుంచి అభిప్రాయపడుతున్నారు.

**ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్ మోసం**

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నేతలు ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరిస్తున్నారు. ప్రజలు సైతం కాంగ్రెస్‌పై ఆగ్రహంతో బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తున్నది. తెలంగాణ గొంతుక వినిపించాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని బీఆర్ఎస్ శ్రేణులు పిలుపునివ్వగా.. ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుంది. అంతేకాకుండా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో జరుగుతున్న ఎన్నికల ప్రచార సభల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగడుతూ వస్తుండటంతో ప్రజలు సైతం ఆలోచనలో పడినట్లు తెలుస్తున్నది.

# మైనార్టీల సంక్షేమం.. బీఆర్ఎస్‌కే సాధ్యం




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

అల్లాపూర్, మే 5 : మైనార్టీ సంక్షేమానికి పెద్ద పీట వేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. ఆదివారం బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్‌డీ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మైనార్టీలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబీహాబేగం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ముస్లింలకు షాదీముబారక్, హిమామ్‌లు, మోజాములకు వేతనాలు, రంజాన్ కానుకలు ఇచ్చి వారి అభివృద్ధి కృషిచేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దే అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మోసపూరిత హామీలు నమ్మి ప్రజలు మోసపోయారని, ఇప్పుడు మరోమారు మోసపోవద్దని తెలిపారు. అనంతరం ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశ్వీదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

# కంటోన్మెంట్‌లో కారెక్కిన కాంగ్రెస్ నేతలు

## ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి సమక్షంలో చేరిక



మైనార్టీ నేతలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

కంటోన్మెంట్, మే 5 : రానున్న ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్‌లో ఎగిరేది బీఆర్ఎస్ జెండానే అని కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బోయిన్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో రెండవ వార్డులోని కాంగ్రెస్‌కు చెందిన పలువురు మైనార్టీ నేతలు మార్కెట్ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ నేతృత్వంలో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే సాయన్న బిడ్డను మనం ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం ఎంతో అవసరమన్నారు. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ గెలిస్తేనే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చివరకు హామీలనే మాఫీ చేసిందని ఎద్దేవా చేశారు. దివంగత ఎమ్మెల్యే సాయన్నను ఎప్పటికీ కంటోన్మెంట్ ప్రజలు మరువరని, ఆయన చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనబడుతుందని స్పష్టం చేశారు.

# 97 మంది నర్సింగ్ ఉద్యోగులకు.. మూడు నెలలుగా జీతాల్లేవ్

## 'నమస్తే' కథనానికి స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ

సుల్తాన్ బజార్, మే 5 : మూడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన వార్తకు వైద్య ఆరోగ్య శాఖ స్పందించింది. ఉస్మానియా దవాఖానకు 138 మంది నర్సింగ్ అధికారులను నియమించగా.. 137 మంది విదుల్లో చేరారని, అందులో 40 మందికి ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. మరో 97మంది నర్సింగ్ అధికారులకు త్వరలోనే వేతనాలు చెల్లించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కాగా నర్సింగ్ ఉద్యోగులు మాత్రం విధుల్లో చేరినప్పటి నుంచి ఎవరికీ వేతనాలు రావడంలేదని తెలుపడం గమనార్హం.